# వేరొక బిడ్డకం కాదా తరుణం?

"పిల్లలెంతమంది, అమ్మాయీ, నీకు?"

వెళుతున్న రైలు కిటికీలో నుంచి బయటికి చూస్తున్న పార్వతమ్మ, ప్రశ్న విని తల తిప్పిచూసింది. తన కెదురుగా ఉన్న బెర్తుమీద పండుటాకులా ఉన్న ముత్తైదువ తనవేపే కుతూహలంగా చూస్తూ అడుగుతూంది. ఆమె పక్కనే కూర్చుని ఏదో ఇంగ్లీషు మాగజైన్ తిరగేస్తూ, ఇంగ్లీషులో కబుర్లు చెప్పుకుంటున్న అధునాతన యువతులు ఇద్దరు కూడా ఆ ప్రశ్నకు సమాధానం ఏం వస్తుందా అన్నట్లు కుతూహలంగా చూస్తున్నారు, మాగజైన్ చదువుతున్నట్లే నటిస్తూ, లేడీస్ కంపార్టుమెంట్ కావడంతో, వివిధ వేషభాషల్లో తొడతొక్కిడిగా ఉన్నారు ఆడవాళ్లు.

"నిన్నే, అమ్మాయీ, నే అడుగుతూంట! పిల్లలెందరు నీకు?" మళ్లీ అడిగిందా ముత్తైదువ.

పార్వతమ్మకు ఓ పట్టాన నోరు పెగల్లేదు. అలవాటు లేని అబద్ధం చెప్పాలనిపించింది. కానీ ఏదో భయం, 'తప్పు' అన్న భావం ఆ అబద్ధాన్ని గొంతుక బయటికి రానివ్వలేదు.

"ఆరుగురు! ముగ్గు రాడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు!"

ఆ క్షణంలో తను భూమిలోకి దిగిపోతున్నంత బాధ అనిపించిందామెకు.

ముసలి ముత్తైదువ మెప్పుదలగా తల ఆడించింది. కానీ ఆవిడ పక్కనున్న ఇద్దరు మాత్రం ఒక్కమారుగా ఏదో పిడుగుపడ్డట్టు గుండెల

మీద చేతులు వేసుకుని, "బాప్‌రే!" అన్నారు కీచుగా. పార్వతమ్మ తల ఎత్తి వాళ్ళకేసి చూడాలనుకుంది. చూడలేకపోయింది.

తమని పార్వతమ్మ గమనించిందని, తమ మాట కావిడ బాధ పడుతూందనీ తోచిందల్లే ఉంది—ఇద్దరి కిద్దరూ మాగజైన్‌లోకి ముఖాలు దూర్చుకుని, మెల్లగా ఇంగ్లీషులో సంభాషణ మొదలెట్టారు. "వాటెపిటీ!" అంది ఒకామె.

"పిటీ కాదు! ఇట్ ఈజ్ యాన్ అఫెన్స్ . . . ఎగైనెస్ట్ కంట్రీ!"

"ఎస్ . . . ఎస్ ! ఇలాంటి వాళ్ళందర్నీ బలవంతంగా లాక్కెళ్ళి ఆపరేషన్స్ చేయిస్తే తప్ప . . . దేశం బాగుపడదు!"

ముసలావిడ ఏదో ప్రశ్నలు వేస్తూంది. "పెద్దపిల్ల కెన్నేళ్ళు . . . పెళ్ళి అయిందా?" — ఇలా ఏవేవో! పార్వతమ్మ కవేం వినిపించటం లేదు. ఎదుటి యువతీమణు లిద్దరూ తన గురించీ, తన సంతానాన్ని గురించీ, ఏదో హేళనగా మాట్లాడుతున్నా రన్నది మాత్రం అర్థమయింది! ఆమె కళ్ళనిండుగా నీళ్ళు నిలిచాయి. అవి మరెవరూ గుర్తించకుండా చప్పున మొహం బయటికి తిప్పుకుంది. ఆమె మనస్సు మండుతున్నట్లుంది. ఈ మధ్య తను ఇలా పరోక్షంగా అవమానింప బడటం తరుచూ జరుగుతూంది. ఏ పేరంటానికి వెళ్ళినా, పెళ్ళికి వెళ్ళినా, పదిమంది కలిసే ఏ ప్రదేశానికి వెళ్ళినా ఒకరినొకరు — "ఎంతమంది పిల్లలు మీకు?" అని అడగటం. సమాధానంగా "ఒక అమ్మాయి, ఒక అబ్బాయి . . . అంతే!" అని గర్వంగా ఒకరు చెబితే, "ఇద్ద రబ్బాయిలు! ఒక అమ్మాయి . . . ఫుల్‌స్టాప్!" అని మరొకరు గొప్పగా చెప్పుకుంటే, "ఒక్కడే ఒక్కడు . . . చాలు, బాబూ! వాడికి వేళకు అన్నీ అమర్చే సరికే తల ప్రాణం తోకకువస్తోంది! ఇక కనాలేను, పెంచాలేను" అంటూ మరొకామె గారాలు పోతూంటే, తనమీదికా ప్రశ్న ఏ క్షణాన వచ్చి

పడుతుందోననిపించి తప్పుకు పోబోయేంతలో, ఎవరో ఒకరు అడగనే అడిగేవారు — " మీ కెంతమందండీ, పార్వతమ్మగారూ ? " అంటూ.

మొదట్లో గర్వంగానే చెప్పుకొనేది. " అదో ఆ కనిపించేది పెద్ద పిల్ల. ఆ నీలం పరికిణీపిల్ల రెండోది. వీడు నాలుగోవాడు. ఇది మూడో పిల్ల . . ." ఇలా.

" ఇంతకూ మొత్తమెంతో చెప్పారుకారు! " అంది ఒకామె వెటకారంగా.

"ఆరుగురు!" అంది తను.

అంతే. "మైగాడ్!" అన్న కీచుగొంతులూ, "బాప్‌రే!" అన్న బొంగురు గొంతులూ, "ఓ కంపార్టుమెంటు కేటాయించాలి!" అన్న వ్యంగ్యాలూ, "ఇలాంటి వారి ఇళ్ళలో ఫామిలీ ప్లానింగ్ స్టాఫ్‌ను దించాలి!" అన్న విసుర్లూ వినీ వినపడునట్లూ, తనకు వినిపించి తీరాలన్నట్లూ వినిపించేవి.

అంతే. ఆ తరవాత తరవాత పేరంటాలకూ, పెళ్ళిళ్ళకూ హాజరు కావలసివస్తే, పిల్లలను ఇంటిదగ్గరే ఉండమనేది. ఊహ తెలిసీ తెలియని వయసుతో, అక్కడేం జరుగుతుందో చూడాలనే ఆత్రతతో పిల్లలు వెంట వస్తామని మారాం చేసేవారు.

"వాళ్ళనీ పిలుచుకు వెళ్ళవే, పార్వతీ!" అంటుంది అత్తగారు.

ఆవిడ కేం తెలుసు? పది మంది మగపిల్లల్నీ, ఇద్దరు ఆడపిల్లల్నీ కని 'మహాతల్లి!' అన్న పేరు తెచ్చుకున్న ఆవిడ! ఆవిడ చేతి చలువ మంచిదని గొడ్రాళ్ళూ, బాలింతలూ పసుపు కుంకుమకోసం, పాత బట్టల కోసం వచ్చేవారు!

"వద్దత్తగారూ! మీకు తెలియదు. అందరూ హేళన చేస్తున్నారు!" అంది తెగించి.

"ఎవరే ఎగతాళి చేసేది? ఏమని?" ఆశ్చర్యంగా అడిగిందావిడ, నడ్డిమీద చేతులు ఉంచుకుని, వంగిపోయిన శరీరాన్ని సరిగ్గా నించోపెట్టాలనే వ్యర్థప్రయత్నం చేస్తూ.

అంతా చెప్పింది తను. అత్తగారు విరగబడి నవ్వింది.

"వెర్రిపక్షులు, వాళ్ళేదో అన్నారని ఉన్న పిల్లల్ని దాస్తావా? లేరని అశుభం పలుకుతావా? కన్నదినువ్వు. పెంచుకొనేది నువ్వు. నీ సొమ్ముతిని పెరుగుతున్నారేగానీ, నీ పిల్లలకు ఆ వన్నెల విసనకర్రలు ఏం పెడుతున్నారు? చాల్లే — పిచ్చి మాటలు మాట్లాడక వెంట తీసుకెళ్ళు! పిదప కాలం! పిల్లల్ని కన్నతల్లి గొడ్రాలికంటె హీనంగా చూడబడటమా!" అంటూ ఎంతగానో నొచ్చుకుందావిడ.

కానీ అవమానాలు వెంటాడి వేధించాయి. పిల్లలను వెంట పిలుచుకెళ్ళటం మానేసింది. ఎటు చూచినా తనని వెక్కిరిస్తున్నట్లు—'వేరొక బిడ్డకు కాదిది తరుణం. . . . ముగ్గురి పిదప ఎందుకు భారం?' అన్న బొమ్మలూ, 'ఇద్దరూ లేక ముగ్గురు చాలు' అన్నబొమ్మలూ కనిపించసాగాయి.

"చూడండి, పార్వతమ్మగారూ! మనం బ్రతుకుతున్నది ఇరవయ్యవ శతాబ్దంలో! ఇంకా పాత భావాలు పోకుంటే ఎలా? చుట్టూరా ఆ బోర్డులు చూస్తున్నారుకదా? మీకర్థం కావటం లేదా? ఇంకా కంటారా పిల్లల్ని?" ఇలా ఎదుటబడి అడిగేశారు కొందరమ్మాయిలు! వాళ్ళలో పెళ్ళికాని వాళ్ళు కూడా ఉన్నారు. ఆపుకోలేక ఏడ్చిన తనను భర్త ఓదార్చారు— "అవును, పార్వతీ! ఒకప్పుడు గొప్ప, ఇప్పుడు తప్పు! ఆస్తి చాలా ఉందనీ, అన్నం నీళ్ళకూ, గౌరవ ప్రతిష్ఠలకూ లోటు లేదనీ ఇంకింతమంది పిల్లలు ఉన్నా మనకేం ఫర్వాలేదనీ మనకు తెలుసు. మా అమ్మకూడా పదిమంది పిల్లలు ఉండాలని పట్టుబట్టింది. మనిద్దరమూ బాధ

పడటం లేదు. ఇద్దరి కిద్దరం, పిల్లలూ ఆరోగ్యంగానే ఉన్నాం. అయినా కాలస్వభావం మారింది. తాము తక్కువ మందిని కనటం వరకూ, ఫామిలీ ప్లానింగ్ అమలుజరపటం వరకూ గొప్పగా, సంస్కారానికి చిహ్నంగా భావిస్తున్న ఈ నవనాగరికులు ఎదటివారిని పిల్లలెక్కువని హేళనచెయ్యటం ఏం నాగరికతో ఎంత సంస్కారమో నా కర్థంకావటం లేదు.... ఆఖరు పాపతో మనమూ ఫుల్‌స్టాప్ పెట్టేశామని ఈ కుసంస్కారులకు చెప్పుకోవలసిన అవసరం లేదు. నువ్వు బాధపడకు" అంటూ.

రాను రాను పదుగురులోకి వెళ్ళాలంటే భయం పట్టుకుంది తనకు.

ఆ మధ్య ఓసారి...

పార్వతమ్మ శరీరం జలదరించింది. ఆ సంఘటన కళ్ళెదుట నిలిచినట్లయి శరీరమంతా రోమాంచితమయింది.

ఒక్కసారిగా పిల్లలు ముగ్గురికి టైఫాయిడ్ వచ్చింది! మంచా లకు అంటుకుపోయారు.

'ఈ ముగ్గురూ ఈ జబ్బులో వెళ్ళిపోతే? తనూ...."నాకు ముగ్గురే పిల్లలు!" అని చెప్పుకోవచ్చు....

"అమ్మా!"

భయంకరమైన, అతి దారుణమైన ఆ ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ మంచంలోని పిల్లాడి హీనస్వరం వెన్ను చరిచింది. ఒక్క సారిగా తల్లిప్రేమ కదిలిపోయినట్లయింది. ఎంత నికృష్టపు ఆలోచన చేస్తూంది తను!

తను పిల్లలకు తిండి పెట్టుకోలేని నిర్భాగ్యస్థితిలోలేదు. తన పిల్లలు తిన్నంత తినగా, పారేసేంతటి ఐశ్వర్యం ఉంది! ఏ పెద తల్లో తన బిడ్డలను బ్రతికించుకోలేక, మమకారాన్ని చంపుకుని, మానవత్వం మసి

చేసి పిల్లలు చావు కోరుతుందేమో? అదయినా ఊపిరి తిరగని క్షణా లలో! కానీ, తను? కేవలం తనకు పిల్లలు ఎక్కువమంది అన్న అవ మానం, అవహేళనల నుంచి తనను తాను తప్పించు కోవటానికి, అభం శుభం ఎరగని పిల్లలను, అనారోగ్యంతో బాధ పడుతూ, మృత్యువుతో హోరాహోరి పోరాడుతూ, బ్రతుకులోని తీపి చవిచూడాలనే తియ్యటి ఊహలతో ఉన్న ఆ అమాయకులను చల్లగా దీవించాలనేది పోయి, చావాలని కోరుకోవటం ఎంతటి రాక్షసత్వం! ఎంతటి అనాగరికం!

'భగవాన్! నా పాడు కోర్కె వినలేదుకదూ? విన్నా మరిచిపో! నా పిల్లలను కాపాడు....చాలు!' వణికిపోయింది.

"చలిగాలి వేస్తోందల్లే ఉందమ్మా! కిటికీ మూసెయ్యరాదూ?" ముసలి ముత్తైదువ మెల్లిగా తడుతూంది.

ఆలోచనలు ఎగిరిపోయాయి. ఆనాటి తన మనస్థితి, పాడుకోరికా ఈనాడూ అనుభూతికి వచ్చి పార్వతమ్మ శరీరం ఇంకా వణుకుతూంది.

స్టేషన్ దగ్గర బంధువుల ఇంట జరగబోయే పెళ్ళికి తప్పనిసరిగా వెళుతూంది ఆమె. మరో ఊహతోకూడా ఆమె మనస్సు గందరగోళం అవుతూంది! ఆ వివాహంలోకూడా చాలామంది నవనాగరికులు వస్తారు. వారంతా తనని మాటలతో, సైగలతో చిత్రవధ చేస్తారు. అది ఎదుర్కో వటం ఎలా?

స్టేషన్ బయటికి వచ్చి రిక్షా వేసుకుని, పెళ్ళింటి అడ్రస్ చెప్పింది. సరిగా పెళ్ళి వారిల్లు పదిగజాలుందనగా – రోడ్డువారగా కని పించింది పెద్ద పసుపు పచ్చబోర్డు....ఎర్రని అక్షరాలు.... .

'వేరొక బిడ్డకు కాదిది తరుణం... ముగ్గురి పిదప ఎందుకు భారం!'

729



'భగవాన్!' నిట్టూర్చింది పార్వతమ్మ. పెళ్ళివారి ఇంట్లోకి వెళ్ళిపోయింది యాంత్రికంగా.

* * *

తెల్లవారుఝామున యథావిధిగా పెళ్ళి జరిగిపోయింది. నిదరమత్తు వదలించుకోవటానికి తలకోగ్లాసు కాఫీ ఇచ్చారు పెళ్ళివారు. అందరూ తాగుతున్నారు కాఫీ. ఇంతలో అలా బయటికి వెళ్ళిన మగవారిలో కొందరు హడావిడిగా లోపలికి వచ్చారు.

"అక్కడ.... ఆ కుటుంబ నియంత్రణం బోర్డు దగ్గర ....ఎవరో పసిపాపను వదలి వెళ్ళారు, పొత్తిళ్ళలో. ముట్టుకోవటానికి భయం వేసేలా, నెత్తురుగుడ్డులా .... ఏడుస్తోంది ..." అంటూ వర్ణిస్తున్నారు.

క్షణంలో పెళ్ళి ఇంట్లోవారంతా—చిన్నా పెద్దా ఆడా మగా ఆ బోర్డు ఉన్నచోటుకు పరుగు తీశారు. నిజమే! బహుశా ఏ తల్లో బిడ్డలు ఎక్కువయ్యో, లేక తన బిడ్డ అని చెప్పుకోలేని స్థితిలోనో అలా పారవేసి ఉంటుంది. బొడ్డు సరిగాకొయ్యలేదేమో—రక్తం ధారకట్టి ప్రవహిస్తూంది. అలా రక్తం కారి, కారి, ఏడ్చి ఏడ్చి, ఆ బిడ్డ తెల్లారేసరికి చనిపోతుందనో, ఏ కుక్కలో నక్కలో చంపి పారేస్తాయి లెమ్మనో మనసు రాయి చేసుకుని ఉంటుందా తల్లి!

"ఛ... డర్టీ!" ఓ యువతి అసహ్యించుకుంది. మగవారిలో చాలామంది కా దృశ్యం, ఆ పచ్చి నెత్తుటివాసనా వెగటు కలిగించాయల్లే ఉంది—తిరిగి వెళ్ళిపోయారు.

పార్వతమ్మ కుతూహలంగా బిడ్డకేసి చూచింది. కన్నుముక్కు తీరు సరిగానే ఉంది. మగబిడ్డ... బొడ్డుకు దారం కట్టి, ఆ తరువాత కోయకపోవటంవల్ల, 'లీకేజి'తో రక్తం ధారగా కారిపోతూంది! తన

ఆరుగురి బిడ్డల్లో నాలుగో బిడ్డకు నర్సు మరిచిపోయి అలా చేసింది. పొత్తిళ్ళంతా రక్తంతో తడిసిపోవటంతో డాక్టరు వచ్చి చూచి, నర్సును కేకలువేసి, కారణం చెప్పి, తిరిగి బొడ్డు సరిచేశాడు! అందుచేత ఇప్పుడేంచేయాలో ఆమెకు వెంటనే స్ఫురించింది.

పసిగుడ్డును చేతుల్లోకి తీసుకుంది.

"వెంటనే ఓ గట్టి దారంముక్క తీసుకరండి ... చప్పున!" అంటూ అరిచింది.

ఈ జరిగిన పని చూచి విభ్రాంతులైపోయారంతా! ఎవరో పిల్ల దారంకోసం పరుగెత్తింది.

"ఇదెక్కడి పీడ! ఆవిడ ముట్టుకుందా ఛండాలాన్ని?" అనే గుసగుసలు పెద్దగా వినిపించాయి.

పార్వతమ్మ ఏం వినే స్థితిలో లేదు. తెచ్చిన దారంతో బొడ్డు సరిగా కట్టింది. అర నిమిషంలో రక్తస్రావం ఆగి పోయింది!

"ఇప్పుడేం చేస్తావు?" కుతూహలంగా అడిగిం దొకావిడ. నిరసనగా చూస్తూ.

"వేణ్నీళ్ళు పోసి, పౌడర్ రాస్తాను!" కలలో మనిషిలా లేచి నిలుచుంది. ఆమె తలలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

"ఆ బోర్డు చదువు, పార్వతమ్మా! చదువు రాకుంటే నే చదివి చెబుతాను!" అంది, 'ఇద్దరే ఇద్దరు పిల్లలు... ఫుల్‌స్టాప్!' అంటూ నిన్నరాత్రి చెప్పుకున్న ఆవిడ.

"పోనీ... నీ కిద్దరేగా? ముగ్గురి పిదప ఎందుకు భారం? అని కాదూ ఆ బోర్డులోని మాట. మూడో బిడ్డగా— బంగారు తండ్రిలా

ఉన్నాడు — వీణ్ణి చూచుకోరాదూ!" పార్వతమ్మలో ఏదో పట్టుదల హెచ్చింది.

"ఇది మరీ బాగుంది! ఇద్దరే ఎక్కువ అనుకుంటున్నాను. నాకేం ఖర్మ — ఈ శనిని తగిలించుకోవటానికి! కావాలనుకున్నప్పుడు నేనే కంటాను మగపిల్లవాణ్ణి. లేకుంటే లేదు!"

"మరి మాటాడకు!" అరిచింది పార్వతమ్మ.

"కొంపదీసి నువ్వుగాని పెంచుకుంటావా? నీకెంతమంది పిల్లలో మరిచిపోయావా?" నిలదీసి అడిగింది మరొకావిడ.

"మరిచి పోలేదు. నాకు ఏడుగురు పిల్లలు!" ఆ పసిగుడ్డును హృదయానికి హత్తుకుంటూ అందామె. ధృఢ నిశ్చయంతో, ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. పిల్లాడికి స్నానం చేయించి, పౌడర్ రాసి, శుభ్రమైన పొత్తిళ్ళల్లో తన చీర ఒకటి చుట్టి, తిరుగు ప్రయాణం కట్టింది పార్వతమ్మ.

శ్రేయోభిలాషులూ, బంధువులూ మరో మారు హెచ్చరించారు ఆఖరు ప్రయత్నంగా. "మీ ఆయన ఒప్పుకోడు. అత్తగారు ఏడుస్తుంది. ఈ శని నీవెంట వద్దు. అక్కడే పారేయ్! అసలే ఆరుమందిని కని అవమానకర పరిస్థితిలో ఉన్నావు. అదనంగా ఏడో బిడ్డ ఎందుకు? చెప్పుకోలేవు. తల ఎత్తుకోలేవు..."

పార్వతమ్మ ఏ సమాధానమూ చెప్పలేదు.

రిక్షా కదిలింది. ఆ బోర్డు ఈమారు పార్వతమ్మను వెక్కిరించలేదు. ఆమె గర్వంగా తల ఎత్తుకు కూర్చుంది. 'ముగ్గురిపిదప ఎందుకుభారం?' ఆ తరవాత? తన కిక మరెంతమందయినా భారం లేదు? తనను హేళన చేస్తున్న ఆడవాళ్ళందరిలో తల్లులున్నారు. కానీ, తల్లి హృదయం వారిలో

ఒక్కరికీ లేదు. పాలిండ్లున్నాయి. వాటిలో పాలు ఏ నాడో మందులతో ఇంకింప జేసుకున్నారు. అందుకే స్త్రీ సహజమైన దయకూడా లేక పోయింది! అదీ ఆపాలతోబాటు ఇంకిపోయింది. తన భర్త ఒప్పుకోవటం, తన అత్తగారు ఒప్పుకోవటం, ఒప్పుకోక పోవటం తన స్వవిషయాలు. వారి ఇద్దరి హృదయాలూ తనకు తెలుసు.

రైల్లో ఎవరో అడిగారు : "ఎంత మంది పిల్లలమ్మా మీకు ?" చేతుల్లోని పసిగుడ్డు తల ఆప్యాయంగా నిమురుతూ అంది పార్వతమ్మ! "ఏడుగురు!"

"పుట్టింటినుంచా ?"

"ఊఁ!"

ఆమె కాక్షణంలో గర్వంగా ఉంది. తృప్తిగా ఉంది! అవును, మరి, తను ఏడుగురుపిల్లల తల్లి! వేరొక బిడ్డకు ఇదే కాబోలు తరుణం!

("ఆంధ్రప్రభ వారపత్రిక" 25-8-'71)